క్లుప్తంగా

ఆల్బర్ట్‌కు శ్రమశక్తి అవార్డు



ఆల్బర్ట్‌ను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): మే డే సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన శ్రమశక్తి అవార్డు ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ కేడం ఆల్బర్ట్ అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి.త్యాగరాజన్ తదితరులు ఆయనను సన్మానించి మాట్లాడారు. యూనియన్ నాయకులు ఎండీ.రజాక్, పీతాంబరం, బి.రాజేశ్వరరావు, జె.రాజేశ్వరరావు, వి.జాన్ శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్, శ్రీను, చిన్న, సత్యనారాయణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బాలునాయక్‌కు సేవా పురస్కారం



పురస్కారంతో బాలునాయక్

పాల్వంచరూరల్: మండల పరిధి కిన్నెరసానిలోని క్రీడా ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలునాయక్‌కు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని గురువారం హైదరాబాద్‌లోని నెహ్రూ ఆడిటోరియంలో అందుకున్నారు. సామాజిక, పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన మొక్కలను నాటడాన్ని గుర్తించి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి ఈ పురస్కారాన్ని అందజేశారు. ద మిషన్ ఫౌండర్ ఏడుకొండలు, టీఓజీ జిల్లా అధ్యక్షుడు వెంకటపుల్లయ్య పాల్గొన్నారు.

కమలాకర్‌కు...



పురస్కారం అందుకుంటున్న కమలాకర్

కొత్తగూడెంటౌన్: రామవరంలోని హనుమాన్ జిమ్, బ్లడ్ ఫౌండర్ కమలాకర్‌కు శుక్రవారం యంగ్ ఇండియన్ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లి మదీనా పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ అశోక్‌రెడ్డి ఐఏఎస్ చేతుల మీదుగా కొత్తగూడెం పట్టణం రామవరానికి చెందిన కమలాకర్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలన్న, బ్రేక్ ఇన్ స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య పాల్గొన్నారు.

93 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాకు సింగరేణి యాజమాన్యం ఏప్రిల్ మాసంలో నిర్దేశించిన 13.70 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 12.08 లక్షల టన్నులు 93 శాతం సాధించింది. 7 శాతం వెనుకంజలో ఉంది. ఏరియాలోని జేవీఆర్‌ఓసీ-2కు 10.50 లక్షల టన్నుల లక్ష్యానికి 9.85 లక్షల టన్నులు 94శాతం, కిష్టారం ఓసీకి 2.40 లక్షల టన్నుల లక్ష్యానికి 2.09 లక్షల టన్నులు 87శాతం సాధించి 13 శాతం వెనుకంజలో ఉంది. అదే విధంగా ఏరియాలోని ఏకైక భూగర్భగని పీవీకే గనికి 17 వేల టన్నుల లక్ష్యానికి 14 వేల టన్నులు సాధించింది.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: మండల పరిధిలోని యానంబైల్ ఫీడర్ 33 కేవీ లైన్‌లో శనివారం మరమ్మతులు నిర్వహిస్తున్నందున్న నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్‌పీడీసీఎల్ రూరల్ ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా యానంబైల్ ఫీడర్ పరిధిలో కిన్నెరసాని, కోడిపుంజులవాగు, పుల్లాయిగూడెం, పునుకుల, సత్యనారాయణపురం, రెడ్డిగూడెం, ఉల్వనూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

'రాజీవ్ యువ వికాసం' జోష్

- మున్సిపాలిటీలో వరుస ఇంటర్వ్యూలు
- రుణాలపై నిరుద్యోగుల్లో ఆశలు
- నేడు ఎస్సీ లబ్ధిదారుల ఎంపిక



ఇల్లెందు మున్సిపాలిటీలో ఇంటర్వ్యూకు హాజరైన ఎస్టీ లబ్ధిదారులు (ఫైల్)

ఇల్లెందు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం 'రాజీవ్ యువ వికాసం'పథకం ప్రవేశపెట్టింది. గత నెలంతా దరఖాస్తులు స్వీకరించింది. ఈ నెల ప్రారంభం నుంచి అభ్యర్థులతో ముఖాముఖీ నిర్వహిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అగ్రభాగాన ఇల్లెందు మున్సిపాల్టీలో ఒక్కో సామాజికవర్గం వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ఇప్పటికే ఎస్టీ సామాజిక వర్గం అభ్యర్థులకు ట్రైకార్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. తాజాగా శనివారం ఎస్సీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూలు అయితే వేగంగా సాగుతున్నాయి, ఇక రుణాలు అందే ప్రక్రియ కూడా అంతే వేగంగా సాగుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.5 లక్షలు ఉండటంతో యువకుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఒక్కో యూనిట్‌ను రూ.5లక్షలకు పరిమితం చేశారు. దీని ద్వారా తమకు ఉపాధి మార్గం లభిస్తుందని పలువురు ఆశ పడుతున్నారు. అయితే రూ.5లక్షల లోపు ఉన్న యూనిట్ నెలకొల్పే వారు ఆయా సామాజికవర్గం కేటగిరిలో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో పరిశీలించి ఆ యూనిట్ వల్ల ప్రయోజనాలు అంచనా వేసి బ్యాంకర్ రుణం ఇచ్చేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తారంటున్నారు. ఒకే రకమైన యూనిట్‌ను ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే కూడా అందరికీ అదే యూనిట్ వర్తింపజేసే అవకాశం ఉండదు. సామాజికవర్గాల వారీగా కూడా ఒకే యూనిట్‌ను ఎక్కువ మంది నుంచి దరఖాస్తు చేసినా లభించటం కష్టమేనంటున్నారు. గత ప్రభుత్వం వ్యక్తిగత రుణాల పరిమితి రూ.లక్ష వరకు పరిమితం చేయగా ఈ ప్రభుత్వం యూనిట్‌ను రూ.5 లక్షల వరకు నిర్ణయించారు. దీంతో దరఖాస్తుల వెల్లువ సాగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 65 వేల మంది యువతీ యువకులు ఈ 'రాజీవ్ యువ వికాసం'పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎస్టీ వర్గం నుంచి 28 వేలు, ఎస్సీ వర్గం నుంచి 12,500 మంది. బీసీ వర్గం నుంచి 21 వేల మంది, ఈబీసీ నుంచి వెయ్యి మంది, మైనార్టీ వర్గం నుంచి మూడు వేల మంది వరకు దరఖాస్తులు చేసుకున్నారు.

ఇల్లెందు మున్సిపాలిటీలో...

ఇల్లెందు మున్సిపాలిటీలో ఎస్టీలకు 90 యూనిట్లు, ఎస్సీలకు 290 యూనిట్లు, బీసీలకు 560 యూనిట్లు, మైనార్టీలకు నుంచి 222 యూనిట్లు ఎంపిక చేయనున్నారు.

అయోమయంగా అర్బన్, రూరల్ ఆన్‌లైన్ ఆప్షన్లు..

నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు కోరటంతో హడావుడిగా దరఖాస్తులు చేసుకున్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో, మరికొంత మంది ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆఫ్‌లైన్ వారు నేరుగా ఆయా కార్యాలయాలకు వెళ్లి అందజేయగా ఆన్‌లైన్‌లో చేసుకున్న వారు అర్బన్, రూరల్ ఉన్న ఆప్షన్‌లలో తికమక పడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని వారు అర్బన్ ఆప్షన్‌కు బదులు రూరల్ ఆప్షన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారూ ఉన్నారు. మున్సిపాలిటీలోని 24 వార్డుల పరిధిలో కొంతమంది దరఖాస్తులు ఎంపీడీఓ కార్యాలయంలో నమోదయ్యాయి. మున్సిపాలిటీ జాబితాలో తమ పేరు లేదని ఆవేదన చెందుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు ఎంపీడీఓ కార్యాలయం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని దరఖాస్తులను తెప్పించి ఈ జాబితాలో నమోదు చేయాల్సి ఉంది.



ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

ఇంటర్వ్యూకు హాజరు కావాలి..



మున్సిపాలిటీలో ఎస్సీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక శనివారం సీఆర్‌సీ భవనం (మామిడి చెట్ల బడి దగ్గర) ఉదయం 11 గంటలకు జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలి.

– సీహెచ్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, ఇల్లెందు

సముచిత స్థానం కల్పించండి..

ఇల్లెందు: పదేళ్లు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉందని అలాంటి ఈ తరుణంలో పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని దీనిని పార్టీకి దృష్టికి తీసుకెళ్లాలని ఇల్లెందు యూత్ కాంగ్రెస్ నాయకుడు సుమిత్ కోరీ కోరారు. శుక్రవారం ఆలిండియా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను హైదరాబాద్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తే మరింత పట్టుదలతో పని చేస్తారని తెలిపారు.

అన్యాయం చేయొద్దు..

ఇల్లెందు: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, రాజీవ్ యువ వికాసం రుణాల ఎంపికలో మాదిగ జాతికి అన్యాయం చేయొద్దని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్యామ్ కోరారు. శుక్రవారం ఇల్లెందులో మాట్లాడుతూ... ఎస్సీ రిజర్వేషన్ ప్రకారం మాదిగలకు 9 శాతం, మాలలకు 5 శాతం ఫలాలు దక్కాల్సి ఉందన్నారు.

ఇల్లెందు మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కొంతమంది వార్డు అధికారులు మాజీ కౌన్సిలర్లతో కుమ్మక్కై మాలలకు అన్యాయం చేస్తున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని కమిషనర్, ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రిజర్వేషన్ ప్రకారం అందరికీ న్యాయం జరగాలని కోరారు.

పహల్గామ్ దాడికి నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: పహల్గామ్ దాడికి నిరసనగా అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఏఐఎల్‌యూ), పిలుపు మేరకు శుక్రవారం కొత్తగూడెంలో న్యాయవాదుల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు నుంచి పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్ మాట్లాడుతూ...

26మంది అమాయక పర్యాటకులు హత్యకు గురైన పహల్గామ్ ఉగ్రదాడి అమానుషం అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యులు జె.శివరాంప్రసాద్, కోర్టు గౌరవ అధ్యక్షుడు కె.పుల్లయ్య, కార్యదర్శి కె.పురుషోత్తమరావు, మల్లెల ఉషారాణి, ఎల్.రవినాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ బాధ్యులు బి.రమేష్ నాయక్, తెల్లబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల తుది జాబితా విడుదల

ఇల్లెందు: అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా శుక్రవారం విడుదల చేశారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 24 వార్డుల నుంచి ఐదుగురు చొప్పుల సభ్యులు, వార్డు ఆఫీసర్లతో గత నెల 19న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సమావేశం నిర్వహించారు. పది రోజుల పాటు వార్డుల్లో కమిటీ సభ్యులు ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. అయితే రోజురోజుకు జాబితాలో అర్హుల సంఖ్య తగ్గిపోతోంది. ఇల్లెందు మున్సిపాలిటీలో గత ఏడాది జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నవారు 7,200 మంది ఉన్నారు. వీరిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి జాగా కలిగినవారు, జాగ లేనివారు, అనర్హులు ఇలా జాబితాలు సిద్ధం చేయాలని కమిటీలకు సూచించారు. గత నెల 18 నుంచి 30 వరకు ఎంపిక చేశారు. తుది జాబితాలో 357 మందికి చోటు కల్పించారు. అధికారులు ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అభ్యంతరాలు తెలపాలి..

మున్సిపాలిటీలో ఇందిరమ్మ తొలి జాబితాను ప్రకటించాము. ఆయా వార్డుల్లోని అభ్యర్థులు ఎంపికను కమిటీతో పాటు ప్రత్యేక అధికారి పరిశీలనలో ఎంపిక ప్రక్రియ జరిగింది. ఏదైనా ఎంపికలో లోటుపాట్లు ఉన్నట్లు తెలిస్తే లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి.

– సీహెచ్. శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇల్లెందు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



గుండెపుడి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

జూలూరుపాడు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గుండెపుడి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని గుండెపుడి, రామచంద్రాపురం, వీరభద్రాపురం గ్రామాల ప్రజలు జీపీ కార్యాలయాన్ని ముట్టడించి, ఆందోళన చేపట్టారు. సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులను ఎంపికపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.30 వేలు నుంచి రూ.50 వేలు తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేసి, అర్హులకు మాత్రమే ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామచంద్రాపురం, వీరభద్రాపురం గ్రామాల్లో ఒక్క ఇల్లు కూడా ఇవ్వకపోవడానికి కారణమేంటని సెక్రెటరీని నిలదీశారు. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డికి నాయకులు ఫోన్ చేసి సమస్యను వివరించారు. స్పందించిన ఎంపీడీఓ అనర్హుల పేర్లు తొలగించి, అర్హులకు ఇవ్వడం జరుగుతుందని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీధర్, యాసా నరేష్, బానోత్ మధు, వల్లమల్ల చందర్‌రావు, గార్లపాటి వెంకటి, పద్దం సుగుణ, గడిదేశి కనకరత్నం, ఇల్లంగి సీతరాములు, నరసింహారావు, బానోత్ ధర్మా, కొడెం సీతాకుమారి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటో హెల్పర్లకు వేతనాలు ఇవ్వండి..



మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పాల్వంచ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆటో హెల్పర్ల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆటోలకు 26 మంది డ్రైవర్లు, 26 మంది హెల్పర్లు ఉన్నట్లు చెప్పారు. కాగా అందులో డ్రైవర్లతో పాటు ఐదుగురు హెల్పర్లకు గత నవంబర్ నుంచి వేతనాలు ఇస్తున్నారు. మిగతా 21 మంది హెల్పర్లకు మాత్రం వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇలా కొంతమందికి ఇచ్చి, మరికొంత మందికి ఇవ్వకుండా అధికారులు వివక్ష చూపించడం సరికాదన్నారు. వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళన వద్దకు చేరుకున్న సీపీఐ, సీపీఎం, టీడీపీ, కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ కె.సుజాతతో మాట్లాడారు. వారికి కూడా వేతనాలు వచ్చేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించినట్లు కార్మికులు తెలిపారు.

కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, ఎస్‌వీఆర్ ఏకే.ఆచార్యులు, కనగాల అనంతరాములు, కార్మికులు కోళ్ల ప్రవీణ్, మల్లికార్జున్, వీరభద్రం, పార్వతి, వెంకటరమణ, సరోజ, జీవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ పూజలు



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య లక్ష్మి, కోరం సురేందర్ ఉమ దంపతులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో ఘనంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు మూడు రోజులు నిర్వహించనున్న బొడ్రాయి, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ, పోతురాజు, గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా తొలిరోజు జరిగిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య లక్ష్మి, కోరం సురేందర్ ఉమ దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు

జీఎం పర్సనల్‌గా కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): జనరల్ మేనేజర్ పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్)గా జీవీ కిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈఈ సెల్ ఇన్‌చార్జ్‌గా మురళీధర్‌రావు...



మురళీధర్‌రావు

ఈఈ సెల్ ఇన్‌చార్జ్‌గా ఏజీఎం మురళీధర్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు, సీఎంవోఏఐ అధికారులు, యూనియన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

మలేరియా నిర్ధారణకు రక్త పరీక్షలు



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న హరికృష్ణ

టేకులపల్లి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ మరియు స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆదేశానుసారం మలేరియా ప్రభావిత గ్రామాలైన మొట్లగూడెం, జంగాలపల్లి గ్రామాలలోని ప్రజలలో మలేరియా నివారణకు తీసుకునే ముందస్తు చర్యలలో భాగంగా అక్కడి ప్రజల్లో మలేరియా పారాసైట్ కనుగొనడానికి ప్రత్యేక రక్త నమూనాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. తలనొప్పి, చలిజ్వరం, వణుకు, జ్వరం తగ్గిపోయాక చెమటలు మరియు నీరసం మలేరియా ప్రధాన లక్షణాలని చెప్పారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ తెలిపారు. వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో లభించే ఉచిత చికిత్స తీసుకుంటే ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవచ్చని లేదంటే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. మలేరియా వచ్చిన వ్యక్తిని కుట్టిన ఆడ అనాఫిలిస్ దోమ ఆరోగ్యవంతులని కుట్టడం ద్వారా మలేరియా త్వరితగతిన వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. అందరూ అవగాహన పెంచుకొని ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలను లేకుండా, దోమ పుట్టకుండా, కుట్టకుండా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, ధనసరి రాంబాబు, ఇర్పా నాగలక్ష్మి, స్రవంతి, మానస, అరుణాదేవి ఆశా కార్యకర్తలు రాంబాయి, కవిత, మంగమ్మ, శిరోమణి, వెంకటరమణ, లక్ష్మి, నరసమ్మ, శారద, కమలా బాయి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులల్లో జాప్యాన్ని నివారించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జీఓ నం.76 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని, ఎలక్షన్ కోడ్ కారణంగా నిలిపివేసిన వాటిని అందజేయాలని, 36 వార్డుల్లో నిర్వహించిన గ్రామసభల్లో పేర్లు చదివిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరికీ మొదటి విడతలోనే వచ్చే విధంగా చూడాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి కమిషనర్, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న రేషన్ కార్డుల జారీలో జాప్యం లేకుండా చూడాలని, వీధి కుక్కలు, కోతుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని, వేసవికాలం దృష్ట్యా పారిశుద్ధ్య కార్మికుల పనివేళల్లో మార్పులు చేయడంతో పాటుగా పెండింగ్‌లో ఉన్న పారిశుద్ధ్య, ట్రాలీ డ్రైవర్ల జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీకి డీఎంఎఫ్ నిధుల కింద మంజూరైన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అన్ని వార్డుల్లో శంకుస్థాపనలు సైతం పూర్తయ్యాయని, కానీ 2, 6, 35 వార్డుల్లో సింగరేణి అనుమతి తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదన్నారు. వెంటనే సింగరేణి అనుమతి తీసుకుని వాటిని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. 1985 నుంచి 2023 వరకు ఇంటి నంబర్లు ఉన్నవారికి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు లేకుండా అధికారులు అనుమతులు ఇవ్వాలన్నారు. అంతిమ రథయాత్ర వాహనాన్ని ఉచితంగా బాధితులకు పంపించాలని, రాజీవ్ పార్క్‌లో లైటింగ్, ఓపెన్ జిమ్, తాగు నీరు, టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. సింగరేణి ప్రధానాస్పత్రి సెంటర్‌లో వాటర్ ఫౌంటెన్ ఔట్ పైపులైన్ నిర్మాణం చేయించాలని, మధ్యలోనే నిలిచిపోయిన సింగరేణి ప్రధాన ఆస్పత్రి సెంటర్ నుంచి 7 హిల్స్ ఎన్‌టీఆర్ బొమ్మ వరకు రోడ్డుకు ఇరువైపుల రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో వార్డుకు రూ.లక్ష చొప్పున వాటర్ పైపులైన్‌కు బోర్లు వేయించేందుకు గత కౌన్సిల్‌లో తీర్మానం చేయడం జరిగిందని, వేసవికాలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న కారణంగా వార్డుకు కేటాయించిన పనులను వెంటనే పూర్తి చేసి నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, మాజీ కౌన్సిలర్లు అంబుల వేణుగోపాల్, ప్రసాద్, రుక్మాంగధర్ బండారి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి



కొత్తగూడెంటౌన్: రామవరం సాధన గ్రౌండ్‌లో క్రీడాకారులు



పాల్వంచ: సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న యుగంధర్‌రెడ్డి

సింగరేణి (కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో ప్రతీ ఏడాది నిర్వహించే సమ్మర్ క్యాంపులో భాగంగా ఈసారి కూడా సమ్మర్ క్యాంపు శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించనున్నామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, పరిసర ప్రాంత వాసులకు నేటి నుంచి 25 రోజుల పాటు అనుభవజ్ఞులైన శిక్షకులచే సమ్మర్ కోచింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు శనివారం మధ్యాహ్నం 3 గంటల లోపు ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ 9959508782 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

కొత్తగూడెంఅర్బన్: వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భ జలాలు అభివృద్ధి చెందడానికి, విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాళ్ సూచించారు. శుక్రవారం కొత్తగూడెం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... మండలంలో ఈసారి పదో తరగతి పరీక్షలకు 783 మంది విద్యార్థులు హాజరు కాగా 693 మంది పాసై 89 శాతం ఉత్తీర్ణత నమోదు అయిందని, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రతీ పాఠశాలలో ఇంకుడు గుంతను ఈనెల 10లోపు నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. 5వ తేదీ నుంచి ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌కు విద్యార్థులందరూ హాజరయ్యేలా చూడాలని చెప్పారు. హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఎంఆర్సీ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో...

కొత్తగూడెంలోని బాబుక్యాంపు పాఠశాలలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బాలాజీ అన్నారు. శుక్రవారం పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ వరకు ఉచితంగా ఈ సమ్మర్ క్యాంపులు జరుగుతాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సైన్స్‌ను పాటించి మూఢ నమ్మకాలను వదిలిపెట్టాలని సూచించారు. మొదటి రోజు క్యాంపులో కథలు చెప్పటం, ఇంగ్లిష్ మాట్లాడించటం, పాటలు, ఫిజిక్స్, సరదా గణితం, తెలుగు పద్యాలు, యోగ, మెడిటేషన్ నేర్పించారు. ముగింపు రోజున విద్యార్థులకు ధృవపత్రాలు, బహుమతులు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నీరజ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితురాలు కస్తూరి, జిల్లా అధ్యక్షుడు కే. వీరభద్రం, కొల్లు నాగేశ్వరరావు, మోహనరావు, ఉపాధ్యక్షులు . సాయిబాబా, సెక్రటరీ, తిరుపాలు, మీరా హుస్సేన్ పాల్గొన్నారు.

సాధన గ్రౌండ్‌లో...

కొత్తగూడెంటౌన్: వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం రామవరంలోని సాధన గ్రౌండ్‌లో శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఎస్‌కే రియాజ్‌పాషా, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కె.మహీదర్, కాశీహుస్సేన్, మోరె రమేష్, కౌన్సిలర్ మోరె రూప, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, హరిసింగ్, మట్టపర్తి రమేష్, జకీర్, శంకర్, జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాస కాలనీ మినీ స్టేడియంలో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో వేసవి అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఒలింపిక్ జెండా ఊపి శిబిరాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ... ఈ కోచింగ్ క్యాంప్ ద్వారా పిల్లలకు మంచి వ్యాయామం, వినోదంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అథ్లెటిక్స్‌లో పిల్లలు, యువత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెక్రటరీ కె.మహిధర్, ఐటీడీఏ వెల్ఫేర్ ఆఫీసర్ చంద్రమౌళి, కోచ్ పి.నాగేందర్, ఎర్రయ్య పాల్గొన్నారు. ఇటీవల ఖమ్మం ఓపెన్ టెన్నిస్ క్రీడల్లో పాల్వంచ సీనియర్ క్రీడాకారులు అన్నం వెంకటేశ్వర్లు, టీం (అండర్ 60), సతీష్, కృష్ణారావు (అండర్ 40) రన్నర్లుగా నిలిచారు. వీరిని స్థానిక మినీ స్టేడియంలో సన్మానించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, టెన్నిస్ సెక్రటరీ భాస్కర్, కబీర్‌దాస్, వంశీ, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.